క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత గని తిమ్మారెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్ట సమీపంలో ప్రకృతిపీఠం ఆధ్వర్యంలో చేపట్టిన పంచమహా యజ్ఞముల ఆలయ నిర్మాణానికి కోవెలకుంట్లకు చెందిన దాత బుధవారం విరాళం అందజేశారు. రిటైర్డ్ అధ్యాపకుడు గని తిమ్మారెడ్డి రూ. 10 వేలను పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సభ్యులు భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్వరరెడ్డి, సురేష్, ఓబులేసు పాల్గొన్నారు.

నేడు బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


జమ్మలమడుగు కూడలిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం జరుగుతుందని ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, ఓబులేసు తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఆయా ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అంకిరెడ్డిపల్లెలో పారిశుద్ధ్య పనులు


జేసీబీ సాయంతో కాలువలో పూడికతీత

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో సర్పంచ్ నాగన్న ఆధ్వర్యంలో బుధవారం మురుగు నీటి కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. సుంకులమ్మ ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఏర్పాటు చేసిన కాల్వలో చాలా రోజుల నుంచి చెత్తా చెదారం పేరుకుపోయింది. మురుగు నిల్వ చేరడంతో జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ

కొలిమిగుండ్ల: రైతులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి జ్యోతి అన్నారు. బుధవారం తిమ్మనాయినపేట, అబ్దుల్లాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జొన్న, మొక్కజొన్న, పసుపు పంటల సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. పంటల సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేసి పెట్టుబడులు ఎక్కువ చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సందీప్ కుమార్, సోనియా బేగం పాల్గొన్నారు.

వలసలు నివారించాలని వినతి


ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

డోన్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు లేక చాలా మంది సదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని.. స్థానికంగా పనులు కల్పించాలని వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డికి వినతి పత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక బెంగళూరు, హైదరాబాద్, గుంటూరు వంటి ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. చదువుకుంటున్న పిల్లలను సైతం వెంట వేసుకుని పోతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పనులు కల్పించాలని కోరారు. ఆయన వెంట కార్మిక సంఘం మండల కార్యదర్శి వరదరాజులు, కొండయ్య, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

జనం దరిచేరని జనరిక్ మందులు

- ప్రజల్లో అవగాహన లోపం
- కొందరు వైద్యుల దుష్ప్రచారమే కారణం
- బ్రాండెడ్ మందుల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న మెడికల్ దుకాణాలు



డోన్‌లోని జనరిక్ మందుల దుకాణం

డోన్: అన్ని రకాల అనారోగ్య సమస్యలకు తక్కువ ధరలకే నాణ్యమైన ఔషధాలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన జనరిక్ (మందుల)దుకాణాలు జనం దరికి చేరడం లేదు. బ్రాండెడ్ మందుల పేరుతో రోగులపై పడుతున్న విపరీతమైన ఆర్థిక భారానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వాస్పత్రులతో పాటు మండలానికి ఒక జనరిక్ మందుల దుకాణాన్ని మంజూరు చేశాయి. అయితే ఈ దుకాణాలపై జనానికి సరైన అవగాహన లేకపోవడం, ప్రభుత్వ వైద్యులు, మెడికల్ కంపెనీల ప్రతినిధుల అసత్య ప్రచారంతో జనరిక్ దుకాణాల్లో మందులు కొనేందుకు రోగులు ఆసక్తి చూపడం లేదు.

అసత్య ప్రచారానికే ఆకర్షణ

నాణ్యత కలిగి అతి తక్కువ ధరలకు అన్నిరకాల అనారోగ్య సమస్యలకు జనరిక్ దుకాణాల్లో మందులు లభిస్తాయి. అయితే కారణం ఏదైనా రోజురోజుకు పెరుగుతున్న అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వయసులోనే చాలా మంది దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడి సతమతమవుతున్నారు. అంతుచిక్కని రుగ్మతలతో రేయింబవళ్లు కష్టించి కూడబెట్టిన సొమ్మును సైతం ఆరోగ్య సంరక్షణకు ఖర్చు చేసి చాలా మంది అప్పుల పాలవుతున్నారు. అబద్ధపు ప్రచారానికే ఆకర్షణ అనే విధంగా తమకు కమీషన్, ఎక్కువ ఆదాయం వచ్చే మందులను రాసే కొంతమంది వైద్యుల వద్దకు వెళ్లేందుకే చాలా మంది మొగ్గు చూపుతుండడం దురదృష్టకరం.

పేదలపై మందుల భారం తగ్గించేందుకు..

సామాన్యులకు ఔషధాల ధరలను అందుబాటులోకి తెచ్చేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనరిక్ దుకాణాలను ఏర్పాటుచేశాయి. మండలానికి ఒక దుకాణం ఏర్పాటైనా కూడా వీటి గురించి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో ప్రైవేటు, మెడికల్ దుకాణాల వైపే ఔషధాల కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

తక్కువ ధరతో మందులు

జనరిక్ కేంద్రాల్లో మందుల అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం నిరాశ కలిగిస్తోంది. కొందరు ప్రైవేటు వైద్యులు తమ క్లినిక్‌లోనే మందుల దుకాణాలను ఏర్పాటు చేసుకుని జనరిక్ మందులపై దుష్ప్రచారం చేస్తుండడం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఈ జనరిక్ కేంద్రంలో మందులను కొనుగోలు చేయలేకపోతున్నారు. ఈ మందులు సక్రమంగా పనిచేయవనే భావన ప్రజల్లో నాటుకునేలా కొందరు చేస్తున్న విష ప్రచారానికి పేద ప్రజలు ఆర్థికంగా కుంగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనరిక్ మందుల నాణ్యత, ధరల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన విధంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ప్రజలు వేలాది రూపాయలను మందుల కొనుగోలుకే వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ధరల్లో వ్యత్యాసం

సాధారణంగా మెడికల్ షాపుల్లో లభించే వివిధ రకాల ఔషధాల ధరల కంటే జనరిక్ దుకాణాల్లో పది నుంచి పదిహేను శాతం తక్కువ ధరకు అన్ని మందులు లభిస్తాయి. బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సైతం 50 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. ఒక్క జనరిక్ షాపులో ఉదాహరణకు రూ.10వేల మందులను నిర్వాహకులు అమ్మితే అదే మందులను ప్రైవేటు మెడికల్ షాపు యజమానులు రూ.40 వేలకు విక్రయిస్తుంటారు. ఇలా బయట దొరికే మందులకు, జనరిక్ కేంద్రాల్లో లభించే మందులకు వ్యత్యాసం భారీగా ఉంటోంది.

జనరిక్ మందులు నాణ్యమైనవే



జనరిక్ దుకాణాల్లో లభించే మందులన్నీ నాణ్యమైనవే. నాసిరకం అని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. ప్రభుత్వం అతి తక్కువ ధరకే సామాన్యులకు మందులు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఈ దుకాణాలను ఏర్పాటు చేయిస్తోంది. వీటిపై ఎలాంటి అపోహలు అవసరం లేదు. అందరూ ధైర్యంగా మందులను కొనుగోలు చేయొచ్చు.

–హనీఫ్, సూపరింటెండెంట్, డోన్ ప్రభుత్వాస్పత్రి

ఇంతవరకు తెలియదు



జనరిక్ దుకాణాల్లో తక్కువ ధరలకు మందులు దొరుకుతాయని ఇంతవరకు మాకు తెలియదు. డోన్ పట్టణంలో జనరిక్ మందుల దుకాణం ఉన్న విషయం కూడా తెలియదు. బయట షాపులలో వేల రూపాయలు పెట్టి మందులు కొంటున్నాం. ఈ జనరిక్ దుకాణాల గురించి ప్రభుత్వం తగిన ప్రచారం చేస్తే పేదలకు భారం తగ్గుతుంది.

–రంగనాయకులు, వైఎస్సార్ నగర్, డోన్

విష ప్రచారం



జనరిక్ దుకాణాల్లో లోకల్ కంపెనీ, నాశిరకం మందులు ఉంటాయని కొందరు విషప్రచారం చేస్తుండడంతో జనరిక్ మందులపై ప్రజలకు నమ్మకం కలగడం లేదు. ప్రభుత్వాలు ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోయినా పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో స్వల్ప లాభాలకే దుకాణాన్ని నడుపుతున్నాం.

–నవీన్‌కుమార్, జనరిక్ దుకాణం నిర్వాహకుడు, డోన్

నాసిరకం అపోహ మాత్రమే



జనరిక్ దుకాణంలో దొరికే మందులు నాసిరకమని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. ప్రభుత్వాలు అతి తక్కువ ధరకే సామాన్య మానవుడికి అందుబాటులో ఉంచేందుకు నాణ్యతతో కూడిన మందులను అందజేస్తున్నాయి. ఈ జనరిక్ దుకాణాల్లో లభించే మందులన్నీ నాణ్యమైనవే. వీటిపై ఎలాంటి సందేహం అవసరం లేదు. మేము అవే మందులు వాడుతున్నాం.

–రామక్రిష్ణ, కొండపేట, డోన్

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్యాపిలి: స్థానిక లక్ష్మిరెడ్డి పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన రంగోత్సవ పోటీల్లో ప్రతిభ చాటుకున్నారు. బుధవారం కర్నూలు డైట్ కళాశాలలో జరిగిన పోటీల్లో లక్ష్మిరెడ్డి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో పూజ, డిజిటల్ కొల్లాజ్‌లో రవితేజ, స్లోగన్స్‌లో జశ్వంత్, డ్రాయింగ్‌లో ఆరిఫ్ అహ్మద్, చేతిరాతలో జానకి తదితరులు జిల్లాస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులను కరస్పాండెంట్ సంజీవరెడ్డి, హెచ్ఎం ఇనాయతుల్లా అభినందించారు.

ప్రతి అర్జీకి పరిష్కారం


మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ నరసింహులు

బేతంచెర్ల: గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని డోన్ ఆర్డీఓ నరసింహులు అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, డీటీ మారుతి, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే రీసర్వే చేపట్టే గ్రామాల్లో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. రీ సర్వేలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లలితాదేవి

బనగానపల్లె రూరల్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలితాదేవి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌పై సెన్సిటైజేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సిగరెట్, ఆల్కహాల్ వంటి గేట్ వే డ్రగ్స్ ద్వారా మాదకద్రవ్యాలు తీసుకోవడం మొదలవుతుందని.. వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కళాశాల అధ్యాపకుడు డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల శరీర అవయవాలతో పాటు మెదడుపై చూపించే ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ వినియోగం నుంచి విముక్తి పొందడం తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, రామన్న, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

388 పశువులకు వైద్య చికిత్సలు



పశువైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు, రైతులకు మందులు పంపిణీ చేస్తున్న వెటర్నరీ ఏడీ

కోవెలకుంట్ల: మండలంలోని అమడాలలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 388 పశువులు, జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య వైద్య శిబిరానికి అమరావతి నుంచి పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు, కార్యక్రమ ప్రత్యేక పర్యవేక్షక అధికారి డాక్టర్ మాధవరావు, పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు రమణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైద్య శిబిరంలో 41 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 18 చూడి పరీక్షలు, 9 గర్భగోశ వ్యాధులు, 96 దూడలు, బర్రెలు, 137 జీవాలకు నట్టల నివారణ మందులు, 93 పశువులకు బొబ్బవ్యాధి టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. అనంతరం పాడి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు.

పశువులకు వైద్య పరీక్షలు

బేతంచెర్ల: మండలంలో ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉన్న పశువులకు టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స, గొర్రెల్లో మశూచి వ్యాధి, కోళ్లలో కొక్కెర వ్యాధి నిరోధక టీకాలు, పశువులు, దూడలకు నట్టల నివారణ కోసం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. అలాగే పాడి పశువులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్యలు రానీయొద్దు


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన్

బనగానపల్లె రూరల్: మండల వ్యాప్తంగా రానున్న వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన్, ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక పొదుపు భవనంలో చెత్త సంపద కేంద్రాల నిర్మాణం ఉపాధి పనులు, తాగునీటి సమస్యపై ఎన్ఆర్‌జీఎస్ టీఏలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన్, ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ.. గ్రామాల్లో మరమ్మతుల్లో ఉన్న చేతి పంపులను బాగు చేయించాలని సూచించారు. ఎక్కడైనా పైప్‌లైన్ల లీకేజీ ఉంటే వెంటనే రిపేర్ చేయించాలన్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి ఓహెచ్ఆర్ ట్యాంకుల క్లోరినేషన్ తప్పనిసరిగా చేసి వివరాలను అక్కడే రాయించాలన్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాల నిర్మాణాల స్థితిగతులను పంచాయతీ కార్యదర్శులు, టీఏలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం రేష్మా తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తే చర్యలు

- నిబంధనలు పాటించని రెండు ఆటోలు సీజ్


రోడ్డు భద్రతపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కోవెలకుంట్ల: ఆటోల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించి రాకపోకలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం డబ్ల్యూగోవిందిన్నె నుంచి బనగానపల్లె వైపు కూలీలను తరలిస్తున్న ఆటోలను స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ తనిఖీ చేశారు. పరిమితికి మించి కూలీలను ఎక్కించడంతో ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం రోడ్డు భద్రతపై కూలీలకు అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు ప్రమాదకరమన్నారు. శిక్షణ లేని డ్రైవర్లు వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని తెలిపారు. డ్రైవర్లు ఎక్కువ మందిని ఆటోల్లో ఎక్కించుకుని వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలని నిరసన


ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


డోన్ టౌన్: ఎల్ఐసీలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రహంతుల్లా, దేవన్న డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం డోన్ బ్రాంచ్ ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ యజమాన్యం ప్రకటించిన 2700 అసిస్టెంట్ ఉద్యోగాలతో పాటు క్లాస్ 4 ఉద్యోగ ఖాళీలు చాలా ఉన్నాయని తెలిపారు. వీటిలో చాలా కాలం నుంచి నియామకాలు జరగడం లేదని చెప్పారు. దీని వల్ల ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీల భర్తీతో పాటు సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కిరణ్‌కుమార్, రాఘవయ్య, శేషయ్య శర్మ, సురేష్, హరిప్రసాద్, బీనారావ్, కళ్యాణ్‌కుమార్, ఉస్మాన్‌బాషా, గోకుల్‌కృష్ణ, ఆనంద్, ఈరన్న, విజయ్‌సింగ్, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంబాపురంలో పంటకోత ప్రయోగం


కంది పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో కంది పంట కోత ప్రయోగం చేశారు. ఏఎస్ఓ దేవదాసు ఆధ్వర్యంలో ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పొలంలో 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో పంటను కోసి వచ్చిన దిగుబడిని తూకం వేయగా 2.920 కేజీలు వచ్చింది. ఈ ప్రయోగం ద్వారా ఈ ప్రాంతంలో సాగు చేసిన కంది సరాసరి దిగుబడి లెక్క కడతామని నేషనల్ శాంపుల్ సర్వే అధికారి సాంబశివుడు తెలిపారు. వారి వెంట వీహెచ్ఏ సుధాకర్, ఇన్సూరెన్స్ అధికారి కళ్యాణ్, వీఆర్ఏ పుల్లన్న, గ్రామ రైతులు ఉన్నారు.

జోరుగా పంట కోతలు


శనగ పంట కోత పనుల్లో కూలీలు

బేతంచెర్ల: మండలంలో కంది, శనగ పంటలు కోత దశకు రావడంతో 10 రోజులుగా తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఖరీఫ్‌లో సుమారు 9 వేల హెక్టార్లలో సాగు చేసిన కంది, రబీలో 2 వేల హెక్టార్లలో సాగు చేసిన శనగ పంటలను కోతలు కోయడంలో రైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్


పాతబస్టాండ్ వద్ద ర్యాలీలో పాల్గొన్న జడ్జి తంగమణి, పోలీసులు

డోన్ రూరల్: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని..తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కోర్టు జడ్జి తంగమణి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద బుధవారం ఆర్టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ముఖ్య అతిథిగా జడ్జి తంగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అలాగే కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే అతివేగంగా వెళ్లకూడదని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. మిమ్మల్ని నమ్ముకుని ఓ కుటుంబం ఉందనే విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. ఇచ్చి ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, వెంకటరాముడు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శకుంతల, సభ్యులు శైలజ, మద్దమ్మ, సుమిత్ర, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రేకర్లు వేశారు.. సూచికలు మరిచారు


మార్కెట్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్


బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద..

అవుకు: మండల కేంద్రంలోని పలు రహదారుల్లో వాహనాలు వేగంగా తిరుగుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహనదారుల వేగానికి అడ్డుకట్ట వేసేందుకు స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేశారు. స్పీడు బ్రేకర్లను వేశారేగాని..ఇక్కడ స్పీడ్ బ్రేకర్ ఉందని సూచికలు వేయడం మరిచారు. దీంతో వాహనదారులకు స్పీడ్ బ్రేకర్లు కనపడక ఉన్నట్టుండి బ్రేకులు వేసి కింద పడి గాయపడుతున్నారు. అవుకు మార్కెట్ సర్కిల్, బస్టాండ్ ప్రాంతం, మండపం వీధి, మెట్టుపల్లె రహదారిలో 3 చోట్ల స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఎక్కడా స్పీడు బ్రేకర్లు ఉన్నట్లు సూచికలు లేదా తెల్ల రంగు లైన్లు వేయలేదు. దీంతో ప్రమాదాలు మరింత ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అవుకు-బనగానపల్లె రహదారిలోని కోనాపురం వద్ద ప్రమాదకరంగా గుంత



ఆదమరిస్తే అంతే

నేషనల్ హైవే అంటేనే వాహనాలు రయ్.. రయ్ అంటూ తిరుగుతుంటాయి. అలా తిరిగితే ప్రమాదం తప్పదని నిరూపిస్తోంది నేషనల్ హైవే 544డీ లోని అవుకు–బనగానపల్లె రహదారి. ఈ రహదారిలోని కోనాపురం గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద మరమ్మతు పనులు జరిగాయి. అక్కడ రోడ్డు అవతల, ఇవతలకు నీరు పోయేలా పైప్ గొట్టాలను అమర్చారు. ఇక్కడే మొదలైంది అసలు సమస్య. గొట్టాలను ఏర్పాటు చేసి పూడ్చే క్రమంలో అరకొర పనులతో సరిపెట్టారు. దీంతో దాదాపు ఐదు అడుగుల పొడవుతో రెండున్నర అడుగులకుపైగా ఎత్తుతో పైప్ గొట్టాలను మట్టితో పూడ్చారు. ఇది ప్రస్తుతం గుంతలమయంగా మారింది. దీని వల్ల నేషనల్ హైవేలో ఇలాంటివి ఉంటాయని ఊహించని వాహనదారులు మట్టి కట్టకు దగ్గరగా వచ్చాక అయ్యో.. ప్రమాదం పొంచి ఉందని గ్రహించి సడన్‌గా బ్రేకులు వేస్తున్నారు. ఆలోగా కిందపడి గాయాల పాలవుతున్నారు. ఎలాంటి ప్రాణహాని జరగక ముందే అధికారులు స్పందించి సరి చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

–అవుకు